సాక్షి రంగారెడ్డి

శనివారం ; 9 ; సెప్టెంబర్ ; 2023



చేసిన పనులే గెలిపిస్తాయి

సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధే తిరిగి గెలిపిస్తుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. 10లో▸



నిధుల మంజూరుకు వినతి

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ రంజిత్‌రెడ్డికి చిన్నమంగళారం గ్రామస్తులు విన్నవించారు. 10లో▸



దుండగులను శిక్షించాలి

జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో బీజేపీ జెండా గద్దె కూల్చిన వారిని శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

బీజేపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న నర్సింహగౌడ్

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయడానికి కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన అమడపురం నర్సింహగౌడ్ శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాను మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోకన్వీనర్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు చెప్పారు. షాద్‌నగర్‌లో బీసీల ప్రాబల్యం అధికంగా ఉందని ఈ మేరకు తనకు అవకాశం కల్పించాలని అధిష్టానానికి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం,రమేష్, రణధీర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, జగన్‌గౌడ్, శ్రీశైలం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

17న తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ

సభా స్థలిని పరిశీలించిన పార్టీ నాయకులు



తుక్కుగూడ శ్రీనగర్‌లో సభా స్థలిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుక్కుగూడ: కాంగ్రెస్ బహిరంగ సభ ఈ నెల17న ఎక్కడ నిర్వహించాలన్న అంశంపై పార్టీ ఓ నిర్ణయానికి వచ్చింది. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ వేదికగా నిర్వహించాలని మొదట భావించినప్పటికీ ప్రభుత్వం నుంచి అనుమతి లభించకపోవడంతో తుక్కుగూడలో చేపట్టాలని నిర్ణయించింది. మున్సిపల్ పరిధిలోని శ్రీనగర (ఈ-సిటీ)లో సభను నిర్వహించనున్నారు. ఇక్కడ 100 ఎకరాలకు పైగా ఖాళీ స్థలం ఉంటడం, నగరానికి అతి సమీపంలో ఉండడంతో జన సమీకరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ఈ మేరకు సభ ఏర్పాట్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభాస్థలి పరిశీలనకు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. సభా స్థలిని పరిశీలించిన వారిలో ఆ పార్టీ నాయకులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

చిలుకూరు సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారి ఊరేగింపు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి మరుసటి రోజు ఇక్కడ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే శుక్రవారం స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ముందు ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి, ఉట్లుకొట్టే కార్యక్రమం విశిష్టతను ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కన్వీనర్ గోపాలకృష్ణ స్వామి, చిలుకూరు సర్పంచ్ గునుగుర్తి స్వరూప, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ జీఎన్ రాజు, పోలీస్ పటేల్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్‌ను కలిసిన 'గోలి'



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖామంత్రి కేటీఆర్‌ను శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

టీచర్ పోస్టులు @823



ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 465 పోస్టులు
- హైదరాబాద్ జిల్లాలో 358
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు
- 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదలైంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 823 పోస్టులను భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, పీఈటీ, భాషా పండితుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 358 పోస్టులు, మేడ్చల్ జిల్లా పరిధిలో 78, రంగారెడ్డి జిల్లా పరిధిలో 196, వికారాబాద్ జిల్లా పరిధిలో 191 పోస్టుల భర్తీకి నవంబర్ 20 నుంచి 30వ తేదీల మధ్య తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు (కంప్యూటర్ ఆధారిత) నిర్వహించనున్నట్లు పేర్కొంది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అభ్యర్థుల గరిష్ట వయో పరిమితి 44 ఏళ్లుగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఇచ్చింది. దివ్యాంగులకు అదనంగా మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చింది. దరఖాస్తు ఫీజు రూ.1000గా నిర్ణయించింది.

మొదలైన బదిలీల ప్రక్రియ

రంగారెడ్డి జిల్లాలో 6,919 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో కొంత మంది ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్నారు. ఇలాంటి వారందరికీ స్థానచలనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు 4,722 దరఖాస్తులు అందాయి. గతంలో 4,194 మంది దరఖాస్తు చేసుకోగా, తాజాగా మరో 528 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 212 మంది ఎలాంటి ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల పేర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో డిస్‌ప్లే చేశారు. 10, 11వ తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 3లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

జిల్లాల వారీగా ఖాళీలు..

జిల్లాపేరు	స్కూల్ అసిస్టెంట్	భాషా పండిట్	పీఈటీలు	ఎస్‌జీటీలు	మొత్తం
హైదరాబాద్	116	57	22	163	358
రంగారెడ్డి	48	25	06	117	196
మేడ్చల్	25	07	01	45	78
వికారాబాద్	102	12	-	77	191

పారదర్శకంగా నిర్వహిస్తాం..



ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియతో పాటు కొత్తగా చేపట్టనున్న టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్టును అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం. ఎలాంటి అవినీతి, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వం. అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ మొదలు.. పరీక్షలు, పేపర్ వాల్యూయేషన్ ఇలా ప్రతీది ఆన్‌లైన్ వేదికగా నిర్వహిస్తాం. మానవ తప్పిదాలకు ఆస్కారం లేదు. ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసిన అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. బదిలీలు, ఖాళీల భర్తీ విషయంలో మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు. పైరవీలకు ఎంత మాత్రం ఆస్కారం లేదు.

– సుశీందర్‌రావు, డీఈఓ

కందుకూరుకు 'లా' కళాశాల మంజూరు

కందుకూరు: బీసీ గురుకుల లా కళాశాలను ప్రభుత్వం కందుకూరుకు మంజూరు చేసింది. మహాత్మాగాంధీ బీసీ డిగ్రీ గురుకులాల్లో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు బదులు ఈ ఏడాది నుంచే బీఏ-ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ లా కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జీఓ జారీ చేసింది. ఈ ఏడాది నుంచే లా తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కందుకూరుకు లా కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో గురుకుల పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటయ్యాయన్నారు. కందుకూరుకు మెడికల్ కళాశాల సైతం మంజూరైందని, త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇంజ నీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

బీసీల సింహగర్జనకు తరలిరండి



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న 'బీసీల సింహగర్జన' సభకు భారీగా తరలిరావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు నాయకులు సభాస్థలి, వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేయాలని చూసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. 'మేమెంతో.. మాకంత' నినాదంతో నిర్వహించనున్న సభకు బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇంటికొకరు చొప్పున వచ్చి బీసీల ఐక్యతను చాటాలన్నారు. సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలన్నదే తమ ఎజెండా అని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలను, ప్రజా ఉద్యమ సంఘాల నేతలు, బహుజన గాయకులు, కవులు, కళాకారులు, మేధావులను సభకు ఆహ్వానించామన్నారు. చేతిలో గొడుగు, సంకలో సద్దిమూటతో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశ్‌చారి, అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సురిగి దర్శన్‌గౌడ్, కౌలే జగన్నాథం, గద్దె విజయ్ నేత, జాజుల లింగంగౌడ్, మాధగాని కృష్ణ, బండిగారి రాజుగౌడ్, గూడూరు భాస్కర్, గొడుగు మహేశ్ యాదవ్, మాద శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు మాధవి, శ్యామల పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ప్రకటించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 60 సంవత్సరాలకు నిర్ణయించాలని సూచించారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రకటించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, ఎంజే ప్రకాష్‌కారత్, ఎన్.యాదగిరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సంబంధిత అధికారులతో కలెక్టర్ హరీశ్ సమావేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ హరీశ్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశ మందిరంలో శుక్రవారం గణేశ్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 18న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై 28న నిమజ్జనం చేయనున్నందున వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు సురక్షిత వాతావరణంలో పండుగ జరుపు కోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేశ్ శోభాయాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు, ప్యాచ్ వర్క్ రిపేర్ పనులు, గణేశ్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రేన్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు కలిసి చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్నచోట భారీ బందోబస్తు కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ క్రేడింగ్, బందోబస్తు, మెడికల్ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నంబరింగ్ ఇచ్చిన మండపాల దగ్గర పరిశుభ్రత పాటించాలని, మండపాల దగ్గర ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఫాగింగ్, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్‌కు సంబంధించి పోల్స్ అవసరమున్న చోట ఏర్పాటు చేయాలని, వేలాడే వైర్లను సరిచేయాలని అన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో ఎలాంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జనం సమయంలో వేలాడే తీగలు, వంగి ఉన్న చెట్లు తదితర వాటిని తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువుల వద్ద క్రేన్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, ఆర్డీఓలు సూరజ్, మల్లయ్య, సాయిరాం, మున్సిప ల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారి శ్రవణ్ ప్రకాష్, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు నిరంజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక రుణాలు



ఆమనగల్లు డీసీసీబీని సందర్శించిన నాబార్డ్ జోనల్ మేనేజర్ స్వప్నిల్

- నాబార్డ్ జోనల్ మేనేజర్ స్వప్నిల్

ఆమనగల్లు: రైతులకు ప్రత్యేక రుణాలు అందిస్తున్నట్లు నాబార్డ్ జోనల్ మేనేజర్ స్వప్నిల్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ శాఖను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, నాబార్డ్ ఏజీఎం రాజీవ్ మోహన్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం స్వప్నిల్ మాట్లాడుతూ.. నాబార్డ్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. వారు ఆర్థికంగా బలపడడానికి వాహన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులకు రూ.1.50 కోట్ల రుణమాఫీ జరిగిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ నబి, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పొందిన రైతులు రెన్యూవల్ చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



ఎన్కెపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

మొయినాబాద్‌రూరల్: రుణమాఫీ పొందిన రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లిలో శుక్రవారం ఆమె రుణమాఫీ పొందిన రైతులతో మాట్లాడారు. లక్ష వరకు రుణాలున్న వారందరికీ విడతల వారీగా మాఫీ అవుతుందని తెలిపారు. అనంతరం వరి, కంది పంటలను పరిశీలించి వరి నాట్లు వేసి 60 రోజులు గడుస్తున్నందున వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకొని మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, గ్రామ సర్పంచ్ చందనచంద్రయ్య, రైతులు, వ్యవసాయ ఏఈవో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెట్లెక్కగలను.. ట్రాఫిక్ గట్టెక్కగలనూ!



అది కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు మెట్రో ప్రాంతం. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 11 గంటలు. అక్కడి రోడ్డుపై వందలాది వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. ఎటు చూసినా రోడ్డు నిండా ట్రాఫికే. ఆ సమయంలో అటువైపుగా గంగిరెద్దుతో వచ్చిన వ్యక్తి పరిస్థితిని పరికించి చూశాడు. కేపీహెచ్ రోడ్డు నంబర్- 4 నుంచి భాగ్యనగర్ కాలనీ వెళ్లాలి. కానీ.. ఇటువైపు రోడ్డు నుంచి అటువైపు దాటడం దుస్సాహసం. పక్కనే ఉన్న మెట్రో ఫుట్‌పాత్ బ్రిడ్జిపై నుంచి వెళ్లడం ఒకటే మార్గం. దానిపైనుంచి తాను వెళ్లగలడు. మరి గంగిరెద్దు మాటేమిటి? ఎలాగైనా తాను, గంగిరెద్దూ వెళ్లాల్సిందే. తాను ముందు నడుస్తుండగా.. ఆయన వెనక గంగిరెద్దుకు ఉన్న పలుపుతాడు పట్టుకుని ఫుట్‌పాత్ ఒక్కో మెట్టు నుంచి నడిపించుకుంటూ ఆవలివైపు నుంచి ఈవలి వైపునకు తీసుకువచ్చాడు. ఫుట్‌పాత్ మెట్లకు గ్రిప్పులు ఉండటంతో గంగిరెద్దు కాళ్లు జారకుండా జాగ్రత్తగా ఇలా నడుచుకుంటూ వచ్చింది. ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు దీన్ని వింతగా చూశారు. – నోముల రాజేశ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం


ఆమనగల్లు: కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ ఏసీపీ సీఎన్ రంగస్వామి

ఆమనగల్లు: జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీ పడే కేసులలో ఇరువర్గాలు చర్చించుకుని రాజీ పడాలని షాద్‌నగర్ ఏసీపీ సీఎన్ రంగస్వామి కోరారు. ఈనెల 9న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన టౌన్ పీఎస్‌ను సందర్శించి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బలరాంలను అడిగి వివరాలు తెలుసుకన్నారు. అనంతరం రాజీపడే కేసులకు సంబంధించి ఇరువర్గాలకు ఏసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేటితో ముగియనున్న ట్రాఫిక్ అదాలత్

చేవెళ్ల: లోక్ అదాలత్‌లతో పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 101 కేసులు పరిష్కరించగా ఇందుకు సంబంధించి రూ.2.85లక్షల జరిమానా వసూలయ్యాయి. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి సాంబశివరావు మాట్లాడుతూ.. వారం రోజులుగా చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పీఎస్‌ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులను పరిష్కరిస్తున్నామన్నారు. శనివారంతో ఈ లోక్ అదాలత్ ముగుస్తుందన్నారు. పెండింగ్ కేసులతో భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఎస్‌ఐ చందర్‌నాయక్, తదితరులున్నారు.

దుండగులను శిక్షించాలి

బీజేపీ నేతల డిమాండ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తూంపల్లిలో బీజేపీ జెండా గద్దె కూల్చిన దుండగులను శిక్షించాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తూంపల్లి చౌరస్తాలో ధర్నా చేపట్టారు. అనంతరం పార్టీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి వస్తున్న ఆదరణ ఓర్వలేకే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డున్నారన్నారు. ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి జిల్లేడ్ చౌదరిగూడ పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, భూపాలచారి, విజయ్‌కుమార్, కుర్మయ్య పాల్గొన్నారు.


బీజేపీ నేతలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ నుంచి గులాబీ గూటికి చేరిన నాయకులు


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మహేశ్వరం: నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్వకోల్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సర్పంచ్ గాదె థామస్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా మహేశ్వరంపై ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపిస్తాయన్నారు. కల్వకోల్–అమీర్‌పేట్ వయా పెండ్యాల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు లక్ష్మణ్, బావయ్య, చంద్రశేఖర్,కష్ణ, నాగరాజు, బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు శేఖర్, లక్ష్మణ్, బి.రాజు శేఖర్, సత్యనారాయణ తదితరులున్నారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు, పార్టీ సీనియర్ నాయకులు పర్వతాలు గౌడ్, ఉప సర్పంచ్ బి.చంద్రయ్య యాదవ్, వెంకటేశ్ యాదవ్, మల్లేశ్ యాదవ్, జి.మల్లేశ్, రమేశ్ యాదవ్, గోవర్దన్, హఫీజ్, లింగం ముదిరాజ్, రాజేశ్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల బాధితులను ఆదుకోండి

- యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంతన్‌గౌరెల్లి గ్రామస్తుల ధర్నా

యాచారం: వడగళ్ల వర్షం కారణంగా రేకుల ఇల్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు తావునాయక్, నానక్‌నగర్ సర్పంచ్ పెద్దయ్య మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం మంతన్‌గౌరెల్లిలో వడగళ్లవానకు 610 రేకుల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు త్వరలోనే పరిహారం అందజేస్తామని నేటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పరిహారం అందజేస్తే ఇళ్ల మరమ్మతులు చేయించుకుంటారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు చందునాయక్, నాయకులు నర్సింహ, రాము, పంతు, లింగ, శంకర్ పాల్గొన్నారు.


ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తావునాయక్, పెద్దయ్య తదితరులు

నిధుల మంజూరుకు వినతి


ఎంపీ రంజిత్‌రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న చిన్నమంగళారం గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ రంజిత్ రెడ్డికి చిన్నమంగళారం గ్రామస్తులు విన్నవించారు. శుక్రవారం సర్పంచ్ సుకన్య, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఎంపీ నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తోల్‌కట్ట సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు విష్ణుగౌడ్, గోపాల్, శంకర్, ఆంజనేయులుగౌడ్, పరమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

రూ.లక్ష నష్టం

తలకొండపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు పాడయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వెల్జాల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రవిగౌడ్ ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి టీవీ, ఫ్రిడ్జ్, ఫాన్స్ తదితరాలు పాడయ్యాయని.. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు.

గంజాయి విక్రేత అరెస్టు

నాగోలు: బీహార్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం మహాదేవ్‌పూర్‌కు చెందిన లాలూదాస్(25) కొన్నేళ్లుగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దేవులమ్మ నాగారంలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఇతను తన సొంత రాష్ట్రం బీహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి చౌటుప్పల్ ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. రాత్రి సమయంలో వెహికల్ చెకింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న లాలూ దాసును పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా యాదగిరిగుట్ట పీఎస్ పరిధిలో 2.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం కొనసాగుతుందని, అమ్మేవారు, కొనుగోలుదార్లపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సీపీ అన్నారు. సమావేశంలో చౌటుప్పల్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బంగారం పట్టివేత


పట్టుబడిన బంగారం

శంషాబాద్: అక్రంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం రస్–అల్– ఖైమా నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలు తనిఖీల్లో తన బ్యాగేజీలో అక్రమంగా తీసుకొచ్చిన 368 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ. 20.35 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో సినీ తారల సందడి



కోకాపేటలో మిర్రర్స్ సెలూన్‌ను ప్రారంభించిన నటి రాశీఖన్నా


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటుడు మహేష్ బాబు సతీమణి నమ్రత, కూతురు సితార

మణికొండ: టాలీవుడ్ సెలబ్రిటీలు హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో సందడి చేశారు. ఇక్కడి రాయ్‌చందాని బిజినెస్ బేలో నూతనంగా ఏర్పాటు చేసిన మిర్రర్స్ లగ్జరీ సెలూన్‌ను నటి రాశీఖన్నా ప్రారంభించగా హీరో మహేష్‌బాబు సతీమణి నమ్రత శిరోడ్కర్, కుమార్తె సితారలు హాజరయ్యారు. రాశీఖన్నా మాట్లాడుతూ అందంగా ఉండాలనేది అందరి కోరికన్నారు. అలాంటి వారి కోరికలను మిర్రర్ లగ్జరీ సెలూన్స్ లాంటి సంస్థలు తీరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నటి జయసుధ, సుధ, జీవితారాజశేఖర్, శివాని, చాందినీ చౌదరి, సంజనా గర్లాని నవదీప్, దగ్గుబాటి అభిరామ్, కిరణ అబ్బవరం, కలర్ ఫోటో ఫేమ్ సందీప్‌రాజ్, సినీ దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్, రాజా రవీందర్, ఇండియన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్ల పట్టివేత

ఇద్దరి అరెస్టు

నాగోలు: అక్రమంగా జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను యాదగిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 239 జిలిటెన్ స్టిక్స్, 666 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు. యాదగిరి గుట్ట సన్నిధి హోటల్ వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై దుంప వినోద్ అనే వ్యక్తి జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా భువనగిరి రూరల్ మండలం రాయగిరి చెందిన శివరాత్రి మహేష్ వద్ద వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు అతని ఇంటిపై దాడి చేసి పెద్ద ఎత్తున జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో వినోద్‌కు పేలుడు పదార్థాల కేసులో ప్రమేయం ఉందని పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను అమ్మకాలు, కొనుగోలు చేస్తుసే వారిపై చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. సమావేశంలో యాదగిరిగుట్ట పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న జిలిటెన్ స్టిక్స్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి చోరీలు

- నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్టు
- రూ. 50 లక్షల సొత్తు స్వాధీనం

నాగోలు: ఆన్‌లైన్ గేమ్‌లు, దురలవాట్లకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటపట్టిన నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను కీసర పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్, కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రం, తిరునల్వేలి జిల్లా, నంగునేరికి చెందిన రామకృష్ణన్(35) పాత నేరస్తుడు. కొంత కాలం క్రితం హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌కు వలస వచ్చి చిరుధాన్యాల వ్యాపారం ప్రారంభించాడు. అదే ప్రాంతంలోని దేవేంద్రనగర్ కాలనీ చెందిన కాగ్ గోవింద్(36) స్థానికంగా బఠాణీలు, మరమరాలు వంటివి విక్రయించే షాపు నిర్వహిస్తున్నాడు.

- రామకృష్ణన్ తరుచూ గోవింద్ షాపు వద్దకు వచ్చేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారు. ఇద్దరూ పలు దురలవాట్లకు బానిసయ్యారు. అవసరమైన డబ్బులను సులువుగా సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

- రామకృష్ణన్ తాను చోరీలు చేస్తానని, చోరీ సొత్తును ఇతర ప్రాంతాల్లో విక్రయించాలని గోవింద్‌కు పురమాయించాడు. రామకృష్ణకు కీసర, కుషాయిగూడ, జవహర్‌నగర్ పరిధిలోని ప్రాంతాలపై అవగాహన ఉండటంతో అక్కడ చోరీలు మొదలెట్టాడు.
- వీరికి అదే ప్రాంతానికి చెందిన బైక్ మెకానిక్ మహేందర్ పవార్(36), బాలాజీనగర్‌లో జ్యువెలరీ వర్క్ షాపు నిర్వహిస్తున్న బచ్చు సంతోష్(40) జత కలిశారు. రామకృష్ణన్ చోరీ చేసిన బంగారాన్ని గోవింద్‌కు ఇస్తే.. దానిని అతను మహేందర్ పవార్, సంతోష్‌లకు ఇచ్చి ఇతర ప్రాంతాల్లో అమ్మించేవాడు. వచ్చిన డబ్బును నలుగురూ పంచుకొనేవారు.
- రామకృష్ణన్ మంకీ క్యాప్, మాస్కు ధరించి తెల్లవారు జామున 3 నుంచి 4 గంటల సమయంలో బైక్‌పై కాలనీలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి దొంగతనం చేసేవాడు.


స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ

బంధువుల ఇంట్లోనే దొంగతనం..

మహేందర్ పవార్ తన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. ఈ విషయంపై రామకృష్ణన్‌కు సమాచారం ఇచ్చిన అతను బంధువుల ఇంట్లో ఎవ్వరూ లేరని, తాళం వేసి ఉందని చోరీ చేయమని చెప్పాడు. దీంతో రామకృష్ణన్ ఆ ఇంటి తాళం పగులగొట్టి లాకర్‌లో ఉన్న బంగారం, వెండి అభరణాలను చోరీ చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కీసర పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను సోమవారం తెల్లవారుజామున అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి రూ. 50 లక్షల విలువైన బంగారం, వెండితో పాటు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. రామకృష్ణన్‌పై 22 చోరీ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. సమావేశంలో మల్కాజిగిరి ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, కుషాయిగూడ ఏసీపీడీసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.